# 21

# హైద్రా'బాదుల్లో' శీను

"నేను వెళ్ళొస్తాను. దీవించు బామ్మా" మోకాళ్ళమీద కూచుని కాళ్ళకి దండం పెట్టాడు శీను. కళ్ళల్లో నీళ్ళతో మనవడి భుజాలమీద చేతులేసింది జయమ్మ.

"ఏం దీవించమంటావురా?"

"అబ్బా! నేనేవన్నా డైలాగ్ రైటర్‌గా వెళ్ళబోతున్నానా నీకు డైలాగ్స్ రాసివ్వడానికి? కాబోయే సినిమా హీరోకి కాబోయే బామ్మలా దీవించు".

"కాబోయే బామ్మేమిట్రా? ఎప్పుడో బామ్మనయ్యాను కదరా?"

"అలా అనుమానంగా భయంగా చూడకు. అప్పుడు మామూలు బామ్మవి. ఇప్పుడు హీరోకి బామ్మవి కాబోతున్నావు" తను కళ్ళనీళ్ళు పెట్టుకున్న విషయమే మర్చిపోయింది జయమ్మ. "అంటే... నువ్వు హీరో అయ్యాక నాకు బామ్మవేషాలొస్తాయి కదరా సినిమాల్లో".

"అంతేగామరి... ఇంతవరకూ తెలుగు సినీరంగంలో బామ్మల్లేరని నీకు దండలేసి తీసికెళ్ళడానికి ప్రొడ్యూసర్లూ డైరెక్టర్లూ క్యూలు కట్టి మనింటి ముందు నిలబడరూ".

"ఏవిట్రా నీ ఎకసెక్కాలు?"

"లేకపోతే ఏవిటీ? నిన్న హీరోయిన్లుగా వేసినవాళ్ళు ఇవాళ బామ్మ అమ్మమ్మల పాత్రలు పట్టుకుని ఏదో ఒకటి వడ్డించండి మాకంతే చాలంటున్నారట. అలాంటప్పుడు కూడుంటే లేవలేని నీకెందుకిస్తారూ?"

"మరీ చెప్తావు నువ్వు... సినిమాల్లో వేసే వాళ్ళకి కాలికీ చేతికీ మనషులుండరూ నన్ను లేవదీసే పని వాళ్ళు చూసుకోరూ".

"చూసుకుంటారు చూసుకుంటారు... ఎత్తి కుదేసే పని చూసుకుంటారు. పైకలా కనపడుతుంటే ఏదో ఈ జీవితాన్ని అలా అలా లాక్కొస్తున్నావుగానీ... కైలాసానికి పిలుపెప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నావేమో అనుకున్నాను. ఫిల్ముల్లోకి పిలుపెప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నావనుకోలేదు. సరే... సరే... నాకు రైలుకి వేళవుతోంది. ఎంతసేపిలా మోకాళ్ళమీద కూచోనూ. తొందరగా దీవించు".

మనవడి తలమీద చెయ్యివేసింది జయమ్మ. "వెళ్ళగానే హీరోవైపోయి నన్ను కూడా ఆ రంగంలోకి లాక్కో నీతోపాటూ నేనూ ఆ కళారంగానికి సేవ చేసుకుంటాను. చిన్నతనం నుంచీ నాకున్న చిరకాల వాంఛ తీర్చుకుంటాను".

"ఓయమ్మో! నీకింత బ్యాక్‌గ్రౌండ్ ఉందని నాకు తెలియదే" మోకాళ్ళు నెప్పెట్టి లేవలేక లేవలేక లేచాడు.

"ఎందుకైనా మంచిది నేను మోకాళ్ళ నెప్పికి రాసుకునే ఆయింట్‌మెంట్ ఇస్తాను. తీసికెళ్ళు. అక్కడెందరి కాళ్ళకి మొక్కాల్సుంటుందో?"

"నీ వేళాకోళం చాలు. నన్నప్పుడే ముసలాడిని చెయ్యకు".

"అసలు నీకు సినిమాల్లో వెయ్యాలన్న బుద్ధి ఎలా పుట్టిందిరా?"

"ఎలా ఏవిటీ? తాతయ్య తన చిన్నప్పుడు తోటిపిల్లల్ని కూడగట్టుకుని వీధి అరుగుమీద ఓ నాటకం వేశానని చెప్పేవాడు కదూ?"

"ఔను. అయితే...?"

"అయితే ఏవిటీ? అర్థంకాలా? జీన్స్ జీన్స్..."

"జీన్స్ ఏవిట్రా బీన్స్‌లాగా?"

"అదంతే... ఆ జీన్స్‌లోనే అంతా ఉంది. అందుకే నాకీ బుద్ధి పుట్టింది. మరి వెళ్ళొస్తాను" తన సూట్‌కేస్ తీసుకుంటూ పక్కనే ఉన్న గోనెసంచీ మూటని చూసి కెవ్వుమన్నాడు.

"సంచీలో శవమా?"

"ఊరుకోరా... అప్రాచ్యపు మాటలూ నువ్వూనూ. ఊరు తీసికెళ్ళదానికి నీకోసం సర్ది పెట్టాను".

"ఏవిటవి?" భయం భయంగా చూశాడు.

"ఏదో కాస్తంత ఆవకాయ కాస్తంత మాగాయి... కాస్త నిమ్మకాయి... కాస్త ఉసిరికాయి..." లిస్టు చదివింది జయమ్మ.

"నేనేవన్నా ఊరగాయలమ్మడానికి వెళ్తున్నానా?"

"పోరా... మరీ చోద్యంగా మాట్లాడతావు".

"లేకపోతే ఏవిటి? అది కాస్తంతా? నాబోటివాడు నాలుగేళ్ళు తిన్నంత తిని పారేసినంత పారేసినా ఖర్చవదు".

"పోదూ బడాయి. నీ స్నేహితుడి రూంలో కదా ఉంటావు. ఆ పిల్లాడూ తింటాడులే".

"ఆ పిల్లాడొక్కరోజు పికిల్ తింటే పదిరోజులు పొట్టపట్టుకుంటాడు. వాడి పేరూ నా పేరూ తల్చుకుంటూ రెండు పూట్లా నువ్వే వేసుకు తిను".

"తప్పుతుందా?... చేసుకున్న వాళ్ళకి చేసుకున్నంత మహదేవా అన్నారు".

"ఎవరో ఒకరు అప్పుడప్పుడలాంటివి అంటుంటే తప్ప కొన్ని కొన్ని జీవిత సత్యాలు బయటపడవులే. మరి నేను వెళ్ళొస్తా".

✧ ✧ ✧

"ఉద్యోగం దొరికిందా ఈ ఊళ్ళో" కాఫీలు తాగడం అయ్యాక స్నేహితుడిని అడిగాడు శంకర్.

"అట్టే లేదు... సినిమాల్లో వెయ్యడానికొచ్చాను".

"కొత్త ముఖాలు కావాలి అని ప్రకటనలు ఏవైనా చూశావా?"

"ఏం లేదు... ప్రయత్నాలు చేసుకుందామనొచ్చాను.

"ఏం చూసుకుని?"

"మరీ అంతలా నా మొహాన్ని తీసిపడెయ్యకు బాగానే ఉంటాను కదా".

"ఎవరికి వాళ్ళం మనం బాగానే ఉంటాంలే. లేకపోతే తెల్లారిలేచీ అద్దాల్లో మొహం ఎలా చూసుకోగలం?"

"ఇప్పుడెన్నయినా అను. రేపు నేను హీరోనై పోయాక అంటే మాత్రం నా అభిమాన సంఘాల వాళ్ళు ఊరుకోరు. జాగర్తమరి".

"ఔనౌను... ఒక పని చెయ్యరాదూ... సినిమాలో ఛాన్సు గురించి తర్వాత చూడచ్చు. ముందు అభిమాన సంఘాలేర్పాటు చేసుకోరాదూ?" వస్తున్న నవ్వాపుకుంటూ స్నేహితుడిని మరింత ఉడికించాడు శంకర్.

"ఆ రోజులు వొస్తాయేమోలే... అదిసరేగానీ శంకర్... నువ్వు ఆఫీసుకెళ్ళేటప్పుడు నేనూ బయటపడతాను. మళ్ళీ ఎప్పుడో రాత్రికి చేరతాను రూంకి. డూప్లికేట్ కీ నాకు పడెయ్యి".

✧ ✧ ✧

"ఎవరు కావాలి?" గేటు దగ్గరాపేశాడు వాచ్‌మెన్.

"ఎవరన్నా పర్వాలేదు. ఏ ప్రొడ్యూసరైనా ఏ డైరెక్టరైనా ఫర్వాలేదు" మహాపోజుగా నిలబడి ధీమాగా అన్నాడు శ్రీను.

పైనించి కిందికి వింతగా చూస్తూ అడిగాడు. "ఈ ఊరు కాదా?"

తల అడ్డంగా తిప్పాడు కాదని. "సినిమాల్లో వేషాలకోసం వచ్చాను. లోపలికి పోనీయవయ్యా నన్ను. ఊరికి కొత్తవాడిని... పెద్దవాళ్ళని కలవాలి".

వల్ల కాదంటే వల్ల కాదన్నాడు వాచ్‌మెన్. కొంచెం దూరంలో నిలబడి వీళ్ళని చూస్తూ వీళ్ళ మాటలు వింటున్న ఓ వ్యక్తి సైగ చేశాడు శీనుని రమ్మని.

దగ్గరికి వెళ్ళగానే మెల్లగా అడుగులు వేస్తూ మాట కలిపాడు.

"ఏంటబ్బాయ్! సినిమాల్లో వేద్దామనొచ్చావా ఈ ఊరు? డైరెక్టర్‌గారికి నీలాంటి కొత్తకొత్త వాళ్ళని సప్లైచేసేది నేనే".

ఉబ్బితబ్బిబ్బయిపోయాడు శీను. తపస్సు చెయ్యకముందే భగవంతుడు ప్రత్యక్షం అయిపోయినంత ఆనందం. "నమస్తే సార్... నమస్తే నా అదృష్టం..."

"ఓ అయిదు వేలియ్యి. రేపీపాటికి నీకో వేషం ఏర్పాటు చేస్తాను".

"అయిదు వేలా సార్?"

"ఏవిటయ్యా? అయిదు వేలా అని నీళ్ళు నములుతావ్... అయిదు రోజుల్లో నీ డబ్బు నీకొచ్చెయ్యదూ?"

నిజమే కదా!... సినిమాల్లో వేలకి వేలు సంపాదించడం ఎంతసేపు?

"కానీ సార్... నా దగ్గర ప్రస్తుతం మూడు వేలే ఉన్నాయి సార్" జేబులోంచి తీశాడు.

"మిగిలింది రేపు తీసుకురా" చేయిజాపాడు.

"రేపే పనయిపోతుందాండీ?"

"ఆహా... రేపు నీ పనైపోతుంది. గోవింద నామస్మరణ చేసుకో... గోవిందా గోవిందా" అంటూ వెళ్ళిపోతున్న వ్యక్తిని ఒళ్ళు పులకరించిపోతూ చూసుకున్నాడు శ్రీను.

✧ ✧ ✧

రాత్రి నిద్రలో కలలే కలలు. తాను తిరుగులేని హీరో... తన చుట్టూ పేరుపొందిన హీరోయిన్లు... రంగుల కలల్లో తేలిపోతూంటే పక్కన రైలు వెళ్తున్న శబ్దం. ఏవిటి రైల్వేస్టేషన్లో ఉన్నాడాతను. మెలుకువ వొచ్చి కళ్ళు తెరిచి చూస్తే పక్కన చాపమీద శంకర్. ఓర్నాయనోయ్... వీడూ వీడి గురక బంగారం కానూ దుప్పటి నెత్తిమీదకి లాక్కుని మరో పక్కకి తిరిగి పడుకున్నాడు. మళ్ళీ కునుకుపట్టే సమయానికి రెండు పిల్లిపిల్లలు దెబ్బలాడుకుంటుంటే మెలుకువొచ్చింది. ఉష్... ఉష్... అంటూ కళ్ళు తెరిచాడు. పిల్లిపిల్లల్లేవు... బల్లిపిల్లల్లేవు, రైలు కాస్తా రెండు పిల్లిపిల్లలై పోయిందని అర్థమైపోయింది.

తనకే కనక వ్యాసాలు రాయడంవొచ్చుంటే గురకలూ– రకాలూ అని గుత్తులు గుత్తులుగా రాసిపడేసే వాడు కాదూ? ఛ... గుత్తులు గుత్తులు అనరేమో... బొత్తులు బొత్తులుగా కాగితాలు అనాలేమో... ఏదో ఒకటిలే... అయినా సినిమాల్లో బిజీ అవబోయేతను... ఎవరి చేతనైనా రాయించాలి. తనకి టైమెక్కడుంటుంది?

✧ ✧ ✧

మర్నాడు మహా హుషారుగా రెండు వేలు సమర్పించుకోడానికి జేబులో వేసుకుని బయల్దేరాడు. వాచ్‌మెన్‌కి సలాంకొట్టి మరీ అడిగాడు "ఆయనొచ్చాడా?"

"ఎవరు?"

"అదేనయ్యా డైరెక్టర్‌గారికి యాక్టర్లని సప్లైచేసే ఆయన... నిన్నవొచ్చాడు.... ఆయన".

"అలాంటి వాళ్ళెవ్వరూ నిన్న రాలేదు".

"నన్ను పిల్చి దూరంగా తీసికెళ్ళి మాట్లాడాడు చూడు... ఆయన గురించి అడుగుతున్నానయ్యా".

"ఆయనెవరో నాకు తెలియదు. ఇక్కడి మనిషి కాదు. నీతో వచ్చిన వాడేమో అనుకున్నాను" విసుగ్గా చూశాడు వాచ్‌మెన్.

నోరెళ్ళబెట్టాడు శీను. కళ్ళముందు మూడువేలు గిరగిరా తిరిగాయి. మొహం వేలాడేసుకుని రోడ్డుపక్కగా నిలబడ్డాడు. ఇంకా ఏదో ఆశ పీకుతోంది మనసులో.

గడ్డాలు మీసాలు... మెళ్ళో లావులావు పూసలదండ పంచెలాల్చీ ప్రసన్నవదనంతో దగ్గరగా వచ్చిందో శాల్తీ. "ఏవిటి కథ... మోసపోయావా ఆ టక్కరోడి చేతిలో, వాడికి ఇవాల్టితో పుట్టగతుల్లేకుండా చేస్తాను. నాతోరా... వాడుండే చోటు నాకు తెల్సు. నీ డబ్బు నీకిప్పిస్తాను".

ఈ విషయం మీకెలా తెల్సు?"

"వాడింతకుముందు కొంతమదినిలాగే మోసం చెయ్యటం చూశాను. అప్పుడు మాటల్తో బుద్ధి చెప్పాను. మనిషి మారాడనుకున్నాను. నిన్న నీ పక్కన చూశా. నువ్వు వాచ్‌మెన్‌తో మాట్లాడింది విన్నానిప్పుడు. అంతా అర్థమైపోయింది నాకు. నీలాంటి అమాయకుల్ని కాపాడటమే పనిగా పెట్టుకున్నాను. రా ఎక్కు" బైక్ చూపించాడు పూసలదండవాడు. తన డబ్బు తనకి తిరిగి ఇప్పిస్తానంటే అంతకంటే ఏం కావాలి? వెళ్ళి అతని వెనక కూచున్నాడు. దేవుడు తనకోసం పంపించాడు కాబోలు ఇతన్ని. గుడ్డిలో మెల్ల... పోన్లే... కొంత నయం. స్టార్ట్ అవడమేంటి... రయ్యిన దూసుకుపోతోంది.

"ఎప్పుడు కొన్నారీబండి?"

"కొనడమా? కొట్టెయ్యడమే తెల్సు..." చిన్నగా నసిగాడు.

"ఏవిటన్నారూ?"

"ఏం లేదు. మాటాడకుండా కూచో. రయ్యిన పోయి డబ్బు తీసుకోవాలి".

"ఇస్తాడంటారా?"

"ఇవ్వకేం చేస్తావు? ప్రాణం తియ్యనూ?"

గతుక్కుమన్నాడు శీను... వాడిననాల్సిందిపోయి నన్నంటాడేంటీ?

"ఎక్కడికండీ ఊరి చివరికి గుట్టల్లోకి తుప్పల్లోకీ తీసుకొచ్చారు?"

"దిగు".

"ఇక్కడా?" భయపడుతూనే దిగాడు.

"తియ్ జేబులోంచి రెండు వేలు" అంటూనే గడ్డాలు మీసాలు తీశాడు.

"అ... నువ్వా? ఎంత మోసం?" నిన్నటి వ్యక్తిగా గుర్తుపట్టాడు శీను.

"సినిమాల్లో వేషాలు కావాలా నీకు? సినిమాల్లో వెయ్యకుండానే రోజూ వేషాలు మార్చి ఎంత హాయిగా నేను సంపాదించుకుంటున్నానో చూడు".

"నేనివ్వను రెండు వేలు".

"ఇయ్యవా?" అదిరిపోయింది శీను చెంప, కాళ్ళూ చేతులూ ఏకీలుకాకీలు విరిగిపోయాయి. లాక్కుపోయాడు డబ్బు.

రెండు గడ్డిబళ్ళూ రెండు లారీలూ పట్టుకుని ఊళ్ళోకొచ్చిపడ్డాడు.

గది తాళం తీస్తూ లోపల అడుగుపెట్టాడో లేదో వెనకాలే వొచ్చాడో కుర్రాడు.

"శంకరన్న అర్జంటుగా ఏదో ఊరికి పోయిండు. ఎప్పుడొస్తడో తెలియదంట, నువ్వొస్తే చెప్పమన్నడు". ఎలా వచ్చాడో అలాగే తుర్రుమన్నాడు మళ్ళీ.

వాడలా వెళ్ళాడో లేదో దఢాలుమంటూ తలుపులు తోసుకుని చేతిలో కర్రల్తో వొచ్చారిద్దరు లోపలికి.

"ఏరా! మా చెల్లెలు కావల్సొచ్చిందా నీకు? మా చెల్లెల్ని ప్రేమిస్తావురా? తను ప్రేమించిన శంకర్నే పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టి మేము తెచ్చిన సంబంధాన్ని కాదంటుందా?"

దెబ్బమీద దెబ్బ వాయిస్తున్నారిద్దరూ.

ఓర్నాయనోయ్!... శంకర్ నీకిలాంటి బ్యాక్‌గ్రౌండ్ కూడా ఉందా బాబూ...

అమ్మా... నాయనా... బాబోయ్... నీ రూంలో ఉన్నందుకు నేను శంకర్నయి నీ దెబ్బలు తినిపెడుతున్నానురా బాబూ. తెలివితక్కువ ప్రయాణాలు చేస్తానని నా గొయ్యి నేను తవ్వుకుంటానని వారఫలాల్లో ఏ పత్రికలోనో రాసే ఉంటాడు నాకు.

నోట్లో మాటలు నోట్లోనే శీనుకి దెబ్బలతాకిడికి... బయటికి పెగల్లేదు మాటలు.

"నువ్వు రాసిన ఉత్తరం మా చెల్లెలి పుస్తకాల్లో చూశాం నీ అడ్రసుతో సహా. అందుకే పట్టగలిగాం నిన్ను. నువ్వుండే రూమిదేనని మా ఫ్రెండొకడు ఇక్కడి బడ్డీకొట్టువాడు చూపించాడు. ఈ క్షణం నుంచీ మా చెల్లెల్తో కనెక్షన్ కట్ చేసుకోకపోయావో దెబ్బల్తో వొదిలి పెట్టం. నీ శవాన్ని కళ్ళచూస్తాం" వొచ్చినంత విసురుగానూ వెళ్ళిపోయారు.

"మీరెవరు?... మీ చెల్లెలెవరు? అసలు నేనెవరు? అయ్యో... బామ్మా..." కుయ్యో మొర్రోమంటూ తన సూట్‌కేస్ తీసుకుని రూంకి తాళం వేసేసి పక్కింట్లో ఇచ్చి... బలుసాకుతినాలి బలుసాకు అనుకుంటూ బస్టాండు కొచ్చిపడ్డాడు శీను.

తలుపు తీస్తూనే మనవడిని చూసి మురిసిపోతూ అడిగింది జయమ్మ "వొచ్చావా? ఏ పాత్రయినా దొరికిందా?"

"భిక్షపాత్ర కూడా దొరకలేదు" వెల్లకిలా మంచమ్మీద విరుచుకుపడ్డాడు ఒళ్ళంతా కొట్టుడు నెప్పుల్తో.

"హైద్రాబాద్‌లో బాదుళ్ళూ హైటెక్ మోసాలేనే బామ్మా" ఏడుపొక్కటే తక్కువగా ఉంది శీనుగొంతులో.

అదేమీ గమనించే స్థితిలో లేదు జయమ్మ.

"నువ్వెళ్ళిన మర్నాడే మన ఇంటి వెనక కాలవ దగ్గర 'మనవడికంటే బామ్మే నయం' సినిమా షూటింగ్ జరిగిందిరా. నేనూ వెళ్ళాను చూడటానికి. ఆ గుంపులో పెద్ద వయసావిడ కావాల్సొచ్చింది కాబోలు వాళ్ళకి, ముందు వరసలో నన్ను నిలబెట్టి ఓ అరనిమిషం షూటింగ్ చేసుకున్నారు. అబ్బా... నా చిరకాల వాంఛ తీరిపోయిందిరా. నేనూ ఓ సినిమాలో వేసినట్టే అయింది. చాలు ఈ జీవితానికి".

"ఆ..." వెల్లకిలా పడిపోయిన శీనుకి ఆటోమేటిగ్గా కాళ్ళూ కీళ్ళూ సరి అయిపోయి లేచి కూచున్నాడు. నోరెళ్ళబెట్టి చూశాడు బామ్మవైపు.

*ఆంధ్రభూమి వారపత్రిక, 3 జూన్ 2008*